నమస్తే తెలంగాణ DISTRICT SUPPLEMENT

యాదాద్రి భువనగిరి

సోమవారం 25 డిసెంబర్ 2023 | MONDAY, DECEMBER 25, 2023 | YADADRI BHUVANAGIRI | పేజీలు PAGES : 8

# స్వేద పత్రంలో మన జిల్లా

## తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో గణనీయ అభివృద్ధి




**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పల్లె నుంచి పట్టణం వరకు మారిన రూపురేఖలు**

**మిషన్ భగీరథతో దశాబ్దాల ఫ్లోరైడ్ భూతం మాయం**

**కాళేశ్వర జలాలతో బీడు భూములు సస్యశ్యామలం**

**మిషన్ కాకతీయ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో పెరిగిన భూగర్భ జలాలు**

**13 లక్షల ఎకరాల నుంచి 26 లక్షలకు పెరిగిన సాగు విస్తీర్ణం**

**ధాన్యం ఉత్పత్తిలో ఉమ్మడి జిల్లా అగ్రస్థానం**

**ఇల వైకుంఠంగా యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం**

**జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు**

**దామరచర్లలో 4వేల మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం**

**అంతటా పెరిగిన సంపద.. మెరుగుపడిన ఉపాధి అవకాశాలు**

**స్వేద పత్రం విడుదల సందర్భంగా జిల్లా ప్రగతిని వివరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**తప్పుడు లెక్కలతో అప్పులు చెప్పిన కాంగ్రెస్.. ఆస్తులు చెప్పలేదని ప్రస్తావన**

4లో..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ప్రజలకు అన్నీ సమస్యలుగానే ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంతో మారింది. వేల కోట్ల రూపాయల అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పల్లెలు, పట్టణాలు కొత్త రూపు సంతరించుకున్నాయి. ఉపాధి అవకాశాలు మెరుగుపడి, సంపద గణనీయంగా పెరిగింది. దశాబ్దాల తరబడి నల్లగొండను పట్టి పీడించిన ఫ్లోరైడ్ రక్కసి మిషన్ భగీరథ పథకంతో పూర్తిగా కనుమరుగైంది. కాళేశ్వరం జలాలతో బీడు భూములు సస్యశ్యామలమయ్యాయి. నాగార్జున సాగర్, మూసీ ప్రాజెక్టుల ఆధునీకరణతో ప్రతియేటా రెండు పంటలకు నీటి విడుదల జరిగింది. ఉమ్మడి జిల్లాలో 2014కు ముందు 13 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా ఈ ఏడాది వరకు 26 లక్షల ఎకరాలకు చేరుకుంది. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు, 24 గంటల విద్యుత్‌తో నాటి నిరసనలు, ధర్నాలు అసలే లేవు. రూ.1200 కోట్లతో యాదగిరి గుట్ట ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించారు. ఇల వైకుంఠంగా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నది. రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందించేందుకు దామరచర్లలో 4వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయి. ప్రభుత్వ దవాఖానలు కార్పొరేట్‌కు దీటుగా మారాయి. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో మెడికల్ కళాశాలలు అందుబాటులోకి రాగా యాదాద్రిలో నిర్మాణం కానున్నది. హరితహారం, పల్లె ప్రకృతి వనంతో పచ్చదనం సంతరించుకోగా.. ప్రతి ఊరికి రోడ్డు, సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం వంటి ఎన్నో పనులు జరిగాయి. కులవృత్తులు మెరుగుపడ్డాయి. చేతినిండా పనులు దొరుకుతుండడంతో వలస జీవులు సొంతూళ్లకు వచ్చి సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. ఇవన్నీ అభివృద్ధి, సంక్షేమంలో జరిగిన మార్పులు. ప్రత్యక్షంగా, పరోక్షంగా మరెంతో మందికి లబ్ధి చేకూరుతున్నది. కానీ ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో శ్వేత పత్రాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని చెప్పింది. కానీ ఆస్తులు, సంపద ఏమేర పెరిగాయో చెప్పలేదు. ఈ విషయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం స్వేద పత్రం విడుదల చేశారు. తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రంతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రగతిని, మార్పును స్పష్టంగా వివరించారు.

– సూర్యాపేట, డిసెంబర్ 24
(నమస్తే తెలంగాణ)/యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట మాఢ వీధుల్లో గోవర్ధనగిరిగా స్వామివారి ఊరేగింపు

8లో..

# వేణుగోపాలుడిగా.. గోవర్ధన గిరిధారిగా..

### యాదగిరి గుట్టలో వైభవంగా అధ్యయనోత్సవాలు

### పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

యాదగిరి గుట్ట ప్రధానాలయంలో ఆళ్వార్ దివ్య ప్రబంధ అధ్యయనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండోరోజు ఉదయం లక్ష్మీనరసింహ స్వామి వేణుగోపాలుడిగా.. సాయంత్రం గోవర్ధనగిరి ధారి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాఢ వీధులు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల కిటకిటలాడాయి.

– యాదగిరిగుట్ట, డిసెంబర్24

# మెర్రీ క్రిస్మస్

### నేడు ఏసుక్రీస్తు జనన వేడుకలు

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన చర్చిలు**

**క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మండలి చైర్మన్ గుత్తా**




సూర్యాపేట నెహ్రూనగర్‌లో విద్యుద్దీపాల అలంకరణలో సీఎస్‌ఐ చర్చి

ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలకు అంతా సిద్ధమైంది. చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలతోపాటు కేక్ కటింగ్ చేయనున్నారు. మరో వైపు క్రిస్టియన్లు తమ ఇండ్లపై స్టార్ లైట్లను ఏర్పాటు చేసుకోగా శాంటాక్లాజ్ వేషధారణలతో చిన్నారులు సందడి చేస్తున్నారు. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విశ్వమానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు నింపిన కరుణామయుడు ఏసు క్రీస్తు అని, ఆయన జన్మదినాన్ని సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు.

– రామగిరి, డిసెంబర్ 24

7లో..



# సీఎం మీటింగ్‌లో మన అధికారులు

రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు ఆదివారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ హనుమంతు కె.జెండగే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి పాల్గొని వివరాలను వెల్లడించారు.

– భువనగిరి అర్బన్, డిసెంబర్ 24